సాక్షి
సిద్దిపేట
ఆదివారం, 16, మార్చి, 2025

మేమున్నామని... మీకేం కాదని

అభాగ్యులను ఆదుకుంటున్న బాలసదనం • చదివిస్తూ..తల్లిదండ్రుల లోటు తీరుస్తూ..




సండే స్పెషల్

తల్లిదండ్రులను కోల్పోయిన అభాగ్యుల పాలిట ఆపన్నహస్తంగా నిలుస్తోంది సిద్దిపేట బాలసదనం. విధి వక్రీకరించి నా అనేవాళ్లు లేక ఏకాకిగా మిగిలిన పిల్లల్ని చేరదీసి ఆదరించి చదువు, వసతి, యోగక్షేమాలను చూస్తూ ఆడపిల్లల పాలిట పుట్టినిల్లుగా మారుతోంది. అలాంటి బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న అభాగ్యులకు దేవుడిచ్చిన అమ్మల మాదిరిగా మహిళా అధికారులు, ప్రముఖుల భార్యలు అండగా ఉంటున్నారు. పండుగలకు బాలసదనం వెళ్లి పిల్లలతో కలిసి పోయి ఆడుతూ పాడుతూ కబుర్లు చెబుతూ వారితో కలిసి భోజనం చేసి కుటుంబ సభ్యుల వాతావరణం అందిస్తారు. ఇలా అభాగ్యులకు ఆత్మస్థైర్యం అందిస్తున్న సిద్దిపేట బాలసదనం పై సాక్షి ప్రత్యేక కథనం.

- సామల చంద్రమౌళి, సిద్దిపేటజోన్

8లో



ఇఫ్తార్	సహర్
ఆదివారం సా. 6.31 గం.	సోమవారం ఉ. 5.02 గం.

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీలో రాణించిన హంసిని



లక్ష్మీహంసినిని అభినందిస్తున్న నరేష్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యాభారతి సంస్కృతి శిక్షా సంస్థాన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి వ్యాసరచన పోటీలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యార్థిని లక్ష్మీహంసిని ప్రథమ స్థానంలో నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్‌కుమార్ అన్నారు. శనివారం హంసినిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో అన్ని పోటీలలో రాణించవచ్చని, ఐదో తరగతి విద్యార్థిని లక్ష్మీ హంసిని నిరుపించారని పేర్కొన్నారు.

వెనుకబడిన పిల్లలకు ఏఐ ద్వారా బోధన

– డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యాపరంగా వెనుకబడిన పిల్లలకు కృత్రిమ మేధ సహాయంతో బోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. మండలంలోని వట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో మాత్రమే ఉపయోగిస్తున్న ఈ ఏఐ విధానం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలలో ప్రవేశపెట్టేలా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ మాధవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు కనకయ్య, సరోజ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పరశురాములు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఇద్దరు డిబార్

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. శనివారం ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు కాపీ చేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. దౌల్తాబాద్‌లో ఒకరు, బెజ్జంకిలో మరొకరు పట్టుబడ్డారు. జిల్లాలోని 43 పరీక్ష కేంద్రాల్లో జనరల్, ఒకేషనల్ మొత్తం 8,050 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 296 మంది వివిధ కారణాల చేత పరీక్షకు గైర్హాజరు అయ్యారు. 7,754 మంది విద్యార్థులతో 96శాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువ ఇవ్వొద్దు

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి స్వాతిరెడ్డి

సిద్దిపేటరూరల్: వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎస్.స్వాతి రెడ్డి అన్నారు. శనివారం నారాయణరావుపేటలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వాతి రెడ్డి మాట్లాడారు. దుకాణాల నుంచి ఎలాంటి వస్తువులు కొన్నా వాటిని పరిశీలించిన తర్వాతనే ఎంఆర్‌పీ డబ్బులు చెల్లించాలని చెప్పారు. ఏదైనా వస్తువు కొనుగోలు చేసినప్పుడు దానిపై ఉన్న ప్రతీ అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. కాలపరిమితి, ఇతర సమస్యలు ఉంటే వెంటనే కంపెనీ వారికి సమాచారం అందించవచ్చన్నారు. ఎటువంటి వివరాలు లేని వస్తువులను కొనకూడదని తెలిపారు. ఎవరైనా ఎక్కువ ధరకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవచ్చని, వస్తువు సంబంధిత బిల్లును కూడా తీసుకోవాలని సూచించారు. వినియోగదారుడికి ఎలాంటి సమస్య ఉన్న వినియోగదారుల కోర్టులో ఉచితంగా కేసు వేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అపూర్వరెడ్డి, ఎంపీడీఓ సూపరింటెండెంట్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కరుణాకర్ పాల్గొన్నారు.

ఈవీ చార్జింగ్.. ఇక ఈజీ..!



సిద్దిపేటలోని ఓ హోటల్‌లో చార్జింగ్ అవుతున్న కారు

హోటళ్లు, రెస్టారెంట్లలో స్టేషన్ల ఏర్పాటు

- టిఫిన్, భోజనం చేసి వచ్చేసరికి పూర్తి
- వాహనదారుల సమయం వృథా కాకుండా ఏర్పాటు



సిద్దిపేటలో ఓ హోటల్‌లో ఈవీ చార్జింగ్ స్టేషన్

సాక్షి, సిద్దిపేట: హోటళ్లు, షాపింగ్ మాల్స్‌లో ఈ-చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులకు ఇబ్బంది తప్పినట్లు అయింది. దీంతో సాఫీగా ప్రయాణం సాగిస్తున్నారు. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ అయితే సామర్థ్యాన్ని బట్టి నిమిషాల్లో ట్యాంక్ ఫుల్ అవుతుంది. అదే ఎలక్ట్రిక్ కారు అయితే 45 నిమిషాల నుంచి ఆరు గంటల వరకు ఛార్జింగ్ అవసరమవుతోంది. ఎక్కువగా ఎంజీ, టాటా, హ్యుందాయ్, కియా, బీవైడీ కార్లను వినియోగిస్తున్నారు. మార్కెట్‌లో రూ.8 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు (బెంజ్ లాంటి కంపెనీలు కాకుండా) కార్ల ధరలు ఉన్నాయి. కార్లను బట్టి 45 నిమిషాల నుంచి 8 గంటల పాటు చార్జింగ్ చేసే 50 కిలో మీటర్ల నుంచి సుమారుగా 350 కిలో మీటర్లు ప్రయాణించవచ్చు. ప్రస్తుతం అంతా ఈవీలపైనే ప్రజలు మక్కువ చూపుతున్నారు. గతంలో ఎలక్ట్రిక్ కారు యజమానులు ముందుగానే బ్యాటరీ చార్జింగ్ చేయించుకునేవారు. కొంత లిమిట్ వరకే వెళ్లేవారు.. మళ్లీ ఛార్జింగ్ స్టేషన్ ఎక్కడ ఉందని వెతుక్కొని చార్జింగ్ పెట్టుకునేవారు. దూర ప్రయాణం చేయాల్సి వస్తే కొంత ఇబ్బంది పడాల్సి వచ్చేది. దీంతో పలు కంపెనీలు ఈ-చార్జింగ్ స్టేషన్లను హోటల్, షాపింగ్ మాల్స్‌లలో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వాహనదారులకు టెన్షన్ పోయింది.

ప్రత్యేక యాప్‌లో వివరాలు..

పలు కంపెనీలను ఈ-చార్జింగ్ స్టేషన్లకు సంబంధించి ప్రత్యేక యాప్‌లను అందుబాటులోకి తెచ్చారు. యాప్ ద్వారా సమీప హోటల్, షాపింగ్ మాల్స్‌లలో ఎక్కడ ఈ-చార్జింగ్ స్టేషన్ అందుబాటులో ఉందో తెలుసుకోవచ్చు. యాప్ ద్వారానే స్లాట్ బుక్ చేసుకోవచ్చు. దీని ద్వారానే డబ్బులు సైతం చెల్లించవచ్చు. దీంతో ప్రయాణం చేసే సమయంలో వాహనాల యజమానులు హోటళ్లలో ఈ-కారు చార్జింగ్ చేసుకునేందుకు మక్కువ చూపుతున్నారు. ఒక వైపు కారులో ప్రయాణించే వారు భోజనం, స్నాక్స్ తీనే సమయంలోనే కారు చార్జింగ్ అవుతుంది. యూనిట్లను బట్టి ఆయా కంపెనీలు ఛార్జింగ్‌కు డబ్బులు వసూలు చేస్తున్నాయి.

టైం వేస్ట్ కావడం లేదు



కారు చార్జింగ్ కోసం ఇది వరకు ప్రత్యేకంగా టైం కేటాయించే వాళ్లం. ఇప్పుడు హోటళ్లలో ఈ-ఛార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తుండటంతో బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ టైం ఏది అయితే ఆ సమయంలో ఒక గంట సమయం ఛార్జింగ్ పెడుతున్నాం. ఇలా అన్ని హోటళ్లలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- ముక్తా శ్రీనివాస్, మంచిర్యాల

రోజుకు 10 కార్లు చార్జింగ్



రెండు నెలల క్రితం మా హోటల్‌లో రెండు కంపెనీలకు చెందిన వారు ఈవీ- ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. కారు ఛార్జింగ్ అయ్యే సమయంలో కస్టమర్లు భోజనం, టిఫిన్, స్నాక్స్, టీ తాగుతున్నారు. ఇలా రోజుకు 10 కంటే ఎక్కువగానే వాహనాలు ఛార్జింగ్ చేసుకుంటున్నారు. కస్టమర్ల నుంచి మంచి స్పందన ఉంది. గతంలో ఈ- ఛార్జింగ్ స్టేషన్ ఎక్కడ ఉందని కస్టమర్లు అడిగే వారు. ఇప్పుడు వారి ఇబ్బందులు తప్పాయి.

- కేఆర్‌శర్మ, జీఎం, హరిత మినర్వా, సిద్దిపేట

సంవత్సరం రిజిస్ట్రేషన్ అయిన అన్ని రకాల వాహనాలు	
2020-2021	8,79,826
2021-2022	9,51,780
2023-2024	9,76,073

లక్ష్యంపైనే గురి పెట్టండి

- ఇష్టమైన రంగాల్లో కృషి చేస్తే సత్ఫలితాలు
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

కొమురవెల్లి(సిద్దిపేట): విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులను పక్కన పెట్టి అనుకున్న లక్ష్యంపైనే గురిపెట్టాలని జిల్లా కలెక్టర్ మిక్కిలేని మనుచౌదరి సూచించారు. మండలంలోని గురువన్నపేట పాఠశాలలో ఎఫ్.ఎల్.ఎన్ (ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ) ప్రోగ్రాం ద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు డీఈవో శ్రీనివాస్‌రెడ్డితో కలసి ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో ఏఐ ద్వారా విద్యాబోధన చేసేందుకు 31 పాఠశాలలు ఎంపిక చేసి ప్రస్తుతం 29 పాఠశాలలో ప్రారభించామన్నారు. జిల్లాలో రూ.30 కోట్లతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా టాయిలెట్స్, అదనపు తరగతి గదులు, ప్రహరీగోడలు తదితర నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు భాషపై పట్టు ఉంటే విజయం సాధిస్తారని తెలిపారు. విద్యార్థులు ప్రతీరోజు వార్త పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఇష్టమైన రంగాలలో కష్టపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

బడిలో నేర్పిన విలువలే పాటిస్తారు

విద్యార్థులకు స్టేజ్ ఫియర్ లేకుండా ప్రతీ రోజు ఒక్కో విద్యార్థితో వర్తమానం అంశాలపై మాట్లాడించాలని, పాఠశాలలో నేర్పిన విలువలు జీవితాంతం పాటిస్తారని ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతులు, పాఠశాల ప్రహరీగోడ, 5 కంప్యూటర్లను వెంటనే మంజూరు చేస్తానని హామీనిచ్చారు. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరిగితే పాఠశాలకు బస్సు, అదనపు తరగతి గదులు, సైన్స్‌ల్యాబ్‌లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రామస్వామి, ఏఎస్‌వో భాస్కర్, తహసీల్దార్ దివ్య, ఎంపీడీవో శ్రీనివాస వర్మ, ఎంఈవో రమేశ్, ఎస్‌ఐ రాజు, పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు బి.రాజు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

కమీషన్ ఇస్తేనే బిల్లులు చెల్లిస్తారట

కలెక్టర్‌కు మొరపెట్టుకున్న అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్లు

కొమురవెల్లి(సిద్దిపేట): అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా పాఠశాలకు మంజూరైన అన్ని పనులను బాధ్యతగా చేపట్టామని, వాటికి సంబంధించిన బిల్లులు అడిగితే కమీషన్‌లు అడుగుతున్నారని అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్లు కలెక్టర్ మనుచౌదరికి మొర పెట్టుకున్నారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గురువన్నపేట ఉన్నత పాఠశాలలో శనివారం ఏఐ ఆధారిత బోధన కార్యక్రమం ప్రారంభోత్సవానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్లు ప్రసంగించాలని సూచించారు. దీంతో జెడ్పీహెచ్ఎస్ కమిటీ ఛైర్మన్ అన్నబోయిన బాలమణి, ప్రాథమిక పాఠశాల కమిటీ ఛైర్మన్ స్వప్న మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా జెడ్పీహెచ్ఎస్‌కు రెండు విడతల్లోరూ7.60 లక్షలు ,ప్రాథమిక పాఠశాలకు రూ.7.70 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. తద్వార కిచెన్ షెడ్స్, ,టాయిలెట్స్, హ్యాండ్‌వాష్ ప్లాట్‌ఫాంల నిర్మాణాలు చేశామన్నారు. జెడ్పీహెచ్ఎస్‌కు సంబంధించిన రూ 4లక్షల బిల్లులు చెల్లింపులో పీఆర్ ఏఈ శివకుమార్ నియమించుకున్న ప్రైవేట్ వర్కర్ శ్రీకాంత్‌కు రూ 4వేలు, డీఈ కార్యాలయ సిబ్బంది మాజీద్‌కు రూ3,500లు చెల్లించినట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాల పనుల బిల్లుల చెల్లింపునకు ఇరువురికి కలిసి రూ 7,000లు తీసుకున్నారని వివరించారు. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు మళ్లీ కమీషన్ ఇస్తేనే చెల్లిస్తామంటూ ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మాటలే తప్ప చేతలేవీ..?

- మైనార్టీలకు అన్యాయం చేసిన సర్కార్
- కేబినెట్‌లో వారికి చోటేది..?
- హామీల అమలులో విఫలం
- సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు ధ్వజం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డివి మాటలు తప్ప చేతలు శూన్యమని మండిపడ్డారు. శనివారం సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో మాజీ సర్పంచ్ మల్లెపల్లి సోమిరెడ్డి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మైనార్టీల సంక్షేమానికి రూ.4వేల కోట్లు ఇస్తానని హామీనిచ్చిందన్నారు. అయితే గత బడ్జెట్‌లో రూ.3వేల కోట్లు మాత్రమే కేటాయించి ఇప్పటివరకు కేవలం రూ.వెయ్యికోట్లే ఖర్చు చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మైనార్టీ యువతకు, మహిళలకు కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు. గత కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందని, దానితో పాటు సకాలంలో షాదీ ముబారక్ పథకం కింద ఆర్థిక సాయం అందించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మత ఘర్షణలు పెచ్చుమీరాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో ఒక మైనార్టీ మంత్రి కూడా లేరని కనీసం వారికి ఎమ్మెల్సీ సీటు కూడా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ లౌకికవాద పార్టీ అని చెప్పుకుంటూ అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీతో ఉన్న అనుబంధాన్ని వ్యక్తపరిచారని గుర్తు చేశారు. దీన్ని బట్టి చూస్తే మైనార్టీల కాంగ్రెస్‌కు ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.



రంజాన్ ఉపవాసాన్ని విరమింపజేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం

తెల్లాపూర్ మున్సిపాలిటీలో అభివృద్ధి కుంటుపడటానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని హరీశ్ రావు ఆరోపించారు. గత ప్రభుత్వ హాయాంలో తెల్లాపూర్ ప్రజల అవసరాల కోసం రూ.500 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేటాయించి అందులో కోట్లాది రూపాయలతో ఫంక్షన్ హాల్‌ను నిర్మించామని అయితే ఇప్పటికీ అది ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదని మండిపడ్డారు. అదేవిధంగా వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ కోసం నిధులు మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిధులను వెనక్కి తీసుకుందని విమర్శించారు. పెండింగ్ నిధులను ఇచ్చి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతకుముందు తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయాన్ని ఆనుకొని నిర్మించిన ఫంక్షన్ హాల్, అసంపూర్తిగా ఉన్న వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్‌ను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి, రసమయి బాలకిషన్, గువ్వల బాల్రాజ్, మాజీ వైస్ ఛైర్మన్ రాములుగౌడ్, సీనియర్ నాయకులు ఎల్లయ్య, బాల్ రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటలను కాపాడండి

- దేవాదుల మూడవ ఫేజ్ మోటార్లు ఆన్ చేయండి
- సర్కార్ నిర్లక్ష్యంతోనే ఎండిపోతున్న పంటలు
- అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాల(సిద్దిపేట): దేవాదుల ప్రాజెక్టు నుంచి మూడవ ఫేజ్ మోటార్లు ఆన్‌చేసి సాగునీరు అందించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన అసెంబ్లీలో దేవాదుల నీటి విడుదలపై మాట్లాడారు. జనగామ నియోజకవర్గం పరిధిలోని చేర్యాల ప్రాంతం దేవాదుల ఆయకట్టు పరిధిలో ఉందని, ప్రస్తుతం వరి, ఇతర పంటలు నీరులేక ఎండిపోతున్నాయని తెలిపారు. కాబట్టి దేవాదుల మూడవ ఫేజ్ కింద సాగునీరు అందించాలని కోరారు. దేవాదుల మొదటి, రెండవ ఫేజ్ పూర్తి కాగా, మూడవ ఫేజ్ నిర్మాణ పనులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి నీరు వస్తున్న క్రమంలో అత్యవసరంగా నీటిని విడుదల చేసి, ఎండుతున్న పంటలను కాపాడాలని కోరారు. జనగామ నియోజకవర్గ పరిధిలో సుమారు 1.50లక్షల ఎకరాలు దేవాదుల ఆయకట్టు కిందికి వస్తుందని చెప్పారు. జిల్లాలో 5.14లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, కేవలం 3లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తామని చెప్పి, 34 రోజులుగా పంపు మోటార్లు ఆగిపోయేటట్టు చేశారని ఆరోపించారు. దీంతో రూ.600 కోట్ల మేర రైతులు నష్టపోయేలా చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయకట్టు, కాల్వ పరిధి కాకున్నా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తపాస్‌పల్లి రిజర్వాయర్ వద్దకు వచ్చి నీళ్లు కావాలని జులుం చేయడం ఏమిటని పల్లా ప్రశ్నించారు. ఆయకట్టు ప్రతిపాదనలతో సంబంధం లేకుండా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గండిరామారం నుంచి నీటిని తరలించడం రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేయడమే అన్నారు. దేవాదుల పంప్‌హౌజ్ వద్ద పంపు ఆపరేటర్లు నిరసన తెలిపే సమయంలో తాను ప్రత్యేక శ్రద్ధ వహించడంతోనే ప్రస్తుతం కొద్ది పాటి నీటి విడుదలకు కారణమైందన్నారు. తాను చెప్పేది అబద్ధమైతే ముక్కు నేలకు రాస్తానంటూ సవాల్ విసిరారు.

తుక్కిబొల్లారం పాఠశాలను సందర్శించిన ఆర్‌జేడీ

ములుగు(గజ్వేల్): మండలంలోని తున్కిబొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత, ఎంపీపీఎస్ పాఠశాలలను రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లో కృతిమమేధతో నిర్వహించే బోధన తరగతులను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు దోహదపడుతాయని తెలిపారు.



మాట్లాడుతున్న గరిమా అగర్వాల్

శిక్షణతో పాటు ఉపాధి కల్పించాలి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు, ఉన్నత చదువులు చదువుకునే వారికి అన్ని రంగాల్లో నైపుణ్యాలు పొందేలా శిక్షణ కల్పించి, ఉపాధి పొందేలా అధికారులు చొరవ చూపాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ స్కిల్ కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీఆర్‌డీఓ, పరిశ్రమల కేంద్రం, సెట్విన్, కార్మికశాఖ, ఉపాధి, పలు శిక్షణ శాఖల ఉమ్మడి భాగస్వామ్యంతో నిర్మాణ రంగం, టైలరింగ్, ఇందిరమ్మ ఇళ్ల కోసం మేస్త్రీల ట్రైనింగ్, కూలీ ట్రైనింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల్లో శిక్షణ ఇవ్వడం కోసం కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. వాటితో పాటుగా బ్యాంకింగ్, ఇతర రంగాల్లో ప్రతిభ చూపేలా పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా, డీఆర్ఓ, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నాగరాజమ్మ, డీపీఓ రాధిక, సెట్విన్ కోఆర్డినేటర్ అమీనాభాను, లేబర్ కమిషనర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ కాంగ్రెస్‌లో గ్రూపుల గోల

- తారస్థాయికి తూంకుంట, బండారు మధ్య విభేదాలు
- ఇరువర్గాల మధ్య సయోధ్యకు మైనంపల్లి యత్నాలు
- కలసిపని చేయాలని నిర్ణయం



మాజీ ఎమ్మెల్యే హనుమంత్‌రావుతో నర్సారెడ్డి, శ్రీకాంత్‌రావు తదితరులు

గజ్వేల్: గజ్వేల్ కాంగ్రెస్ గ్రూపులపై అధిష్టానం సీరియస్‌గా ఉంది. వాటిని చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది. గ్రూపుల గోలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కొంత కాలంగా డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు వర్గాల మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహిస్తున్న విషయం విదితమే. గతేడాది డిసెంబర్ 3న ములుగు మండలం బండతిమ్మాపూర్‌లో స్వాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాక్షిగా రెండు వర్గాల విభేదాలు రచ్చకెక్కిన విషయం కూడా తెలిసిందే. ఆ తర్వాత కూడా విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్ర పార్టీకి కొత్త ఇన్‌చార్జీగా మీనాక్షి నటరాజన్ వచ్చిన సందర్భంలో గజ్వేల్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ నియోజకవర్గం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇలాకా కావడం, బీఆర్ఎస్ ఇక్కడ పటిష్టంగా ఉన్న తరుణంలో కాంగ్రెస్‌లో విభేదాలు ఇదే తరహాలో కొనసాగితే... నష్టం తప్పదని గ్రహించి రెండు వర్గాల మధ్య చర్చలు జరపాలని సూచించినట్లు తెలిసింది. ఈ బాధ్యతలను మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే హన్మంతరావుకు అప్పగించారు. ఈ క్రమంలో మైనంపల్లి రెండు వర్గాలతో సయోధ్య చర్చలు జరిపే పనిలో ఉన్నారు. ఈ మేరకు కొన్ని రోజుల కింద సిద్దిపేటలో ఇరు వర్గాల మధ్య జరిపారు. తాజాగా శనివారం మేడ్చల్ జిల్లా కొంపల్లిలోని తన నివాసం పక్కన ఉన్న ఓ ఆలయంలో మరోసారి చర్చలు జరిపారు. కలిసికట్టుగా పని చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ఫొటోలు గజ్వేల్‌కు చెందిన వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారాయి. మైనంపల్లి ఆధ్వర్యంలో జరుగుతున్న చర్చలు ఫలిస్తే రెండు వర్గాలు ఏకతాటిపైకి వచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా

ఎనిమిది మంది వేటగాళ్ల అరెస్టు

మూడు నాటు తుపాకులు స్వాధీనం



నిందితులను చూపుతున్న అటవీ శాఖ అధికారులు

నర్సాపూర్: అడవి జంతువులను వేటాడేందుకు ప్రయత్నించిన ఎనిమిది మంది వేటగాళ్లను అటవీ శాఖ అధికారులు శనివారం అరెస్టు చేశారు. ఎఫ్ఆర్ఓ అరవింద్ కథనం ప్రకారం ... అటవీ శాఖ నర్సాపూర్ రేంజ్ పరిధిలోని నత్నాయిపల్లి అడవి శివారులో వన్య ప్రాణులను వేటాడేందుకు తుపాకులతో కొంతమంది సంచరిస్తున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వారి కోసం గాలించారు. సంగారెడ్డి జిల్లా బొంతపల్లికి చెందిన యాసిన్, నత్నాయిపల్లికి చెందిన శ్రీకాంత్, శంకరయ్య, శ్రీకాంత్, వీరస్వామి, పోచయ్య, విజయ్, భానుప్రసాద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వారి వద్ద మూడు నాటు తుపాకులు, ఒక కత్తి, గన్‌పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఆర్ఓ అరవింద్ వెంట ఆయన వెంట సెక్షన్ ఆఫీసర్ సాయిరాం తదితరులు ఉన్నారు.

150 టన్నుల అక్రమ ఇసుక పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి శివారులో అక్రమంగా డంప్ చేసిన 150 టన్నుల ఇసుకను శనివారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్, బెజ్జంకి పోలీసులు పట్టుకొని సీజ్ చేసినట్లు సిద్దిపేట కమిషనరేట్ కార్యాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ఇసుకను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బెజ్జంకి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్



నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: గంజాయి చాక్లెట్స్ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ కథనం ప్రకారం... మెదక్ డివిజన్ ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ముత్తంగిలోని ఓ ఇంటి పై దాడులు చేశారు. బిహార్‌కు చెందిన నితీశ్ కుమార్ దగ్గర నుంచి 84 గంజాయి చాక్లెట్ల (మొత్తం 465 గ్రాములు)ను స్వాధీనం చేసుకొని పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఎక్సైజ్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుడు బిహార్‌లో గంజాయి చాక్లెట్స్ కొని ఇక్కడ అధిక ధరకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు.

మేమున్నామని... మీకేం కాదని..

మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన దంపతులు ముగ్గురు ఆడపిల్లలతో పొట్టకూటి కోసం సిద్దిపేటకు బతుకుదెరువు కోసం వచ్చారు. జిల్లా కేంద్రంలో రోడ్డు వెంట చెత్త ఏరుతూ జీవనం సాగిస్తున్నారు. బస్టాండ్ పరిసరాల్లో రోడ్డు పక్కన చిన్నపాటి గుడారం వేసుకొని కాలం వెళ్లదీస్తున్నారు. అలాంటి ఈ కుటుంబం పై విధి పగ పట్టింది. కోవిడ్ మహమ్మారి తల్లిని కబళించింది. తండ్రి మద్యానికి బానిసై పిల్లల ఆలనాపాలనా చూసే పరిస్థితి లేకుండా పోయింది. అలాంటి తరుణంలో ముగ్గురు ఆడపిల్లలను బాలసదనం నిర్వాహకులు చేరదీశారు. వారి చదువు, బాగోగులు అన్ని చూస్తున్నారు.

అది 2021 సంవత్సరం కోవిడ్ ప్రభావంతో జిల్లా భయభ్రాంతులకు గురవుతున్న సమయం. జిల్లాలోని ఓ మండల కేంద్రానికి చెందిన దంపతులకు నలుగురు సంతానం. దంపతుల్లో తండ్రి అనారోగ్యంతో చనిపోగా, కొద్ది రోజులకే కోవిడ్ బారిన పడి తల్లి మరణించింది. తల్లిదండ్రులు దూరమై నలుగురు పిల్లలు అనాథలయ్యారు. వారిలో ముగ్గురు ఆడపిల్లలను బాలసదనం హక్కున చేర్చుకుంది. వారిని చదివిస్తూ తల్లిదండ్రులు లేని లోటు తీర్చుతుంది.

జిల్లా కేంద్రంలోని పట్టణ శివార్లలో జీవిస్తున్న దంపతులకు ముగ్గురు పిల్లలు. వీరి తల్లిదండ్రులు వరుసగా అనారోగ్యంతో చనిపోయారు. బంధువుల పలకరింపు లేక, బాగోగులు చూసే వారు లేక అనాథలుగా మారారు. పరిస్థితి తెలిసి బాలసదనం నిర్వాహకులు ముగ్గురు పిల్లలను చేరదీసి చదువు చెప్పించే బాధ్యత స్వీకరించారు.



కలెక్టర్ మను చౌదరికి రాఖీ కడుతున్న పిల్లలు



పిల్లలతో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

పుట్టినిల్లు తరహాలో యోగక్షేమాలు

- దేవుడిచ్చిన అమ్మ పాత్రలో మహిళా అధికారులు, ప్రముఖుల భార్యలు
- పండుగ, పబ్బాలు చిన్నారుల సమక్షంలో
- పిల్లలతో కాలక్షేపం చేస్తూ ధైర్యాన్ని నింపుతారు
- సిద్దిపేట బాలసదనంపై సాక్షి సండే స్పెషల్



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న హరీశ్ రావు సతీమణి శ్రీనిత

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న బాలసదనం ఇప్పటి చరిత్ర కాదు. ఇది 40 ఏళ్ల కిందట మహిళా వసతి గృహంగా ఏర్పాటైంది. కాలక్రమేణా అభాగ్యులకు వసతినిచ్చే కేంద్రంగా మారింది. ఇందులో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చిన్న పిల్లలకు పూర్తి బాధ్యతలు స్వీకరిస్తారు. ఆరు నుంచి ప్రొఫెషనల్ కోర్సుల వరకు వీరి పర్యవేక్షణలో బయటి ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిస్తారు.

మొత్తం 39 మంది ఆశ్రయం

ప్రస్తుతం బాల సదనంలో తల్లిదండ్రులను కోల్పోయిన 14 మంది బాలికలు, తల్లీ లేదా తండ్రిని కోల్పోయి పోషణ బాధ్యత చూడలేని పరిస్థితుల్లో ఉన్న 16 మంది, బలహీన వర్గాలకు చెంది, పోషణ భారం కష్టంగా ఉన్న కుటుంబాలకు చెందిన 9 మంది, మొత్తంగా 39 మంది ఆశ్రయం పొందుతున్నారు. వీరిలో ఒకటో తరగతి నుంచి ఎంబీఏ చదువుతున్న అమ్మాయి వరకు ఉన్నారు. ఐదవ తరగతి వరకు చదివే బాలికలకు స్థానికంగా వసతి, భోజనం, విద్య ఏర్పాట్లు అందించి, ఇతర ప్రాంతాల్లో పై చదువు కోసం వెళ్లిన వారి పర్యవేక్షణ, ఆరోగ్య సమస్యలు, ఇతరత్రా బాగోగులన్నీ బాలసదనం నిర్వాహకులు బాధ్యత తీసుకుంటారు. జిల్లాలోని వివిధ గురుకుల పాఠశాలలో చదివే వారిని ప్రతి నెలా బాలసదనం నిర్వాహకులు వెళ్లి ఆరోగ్యం, చదువు, యోగక్షేమాలు గూర్చి ఆరా తీస్తారు.

దేవుడిచ్చిన అమ్మలు..

బాలసదనంలో ఉన్న వారికి మహిళా అధికారులు, ప్రముఖులు అండగా ఉంటున్నారు. ప్రతి నెలా వివిధ పండుగలు, సెలవు రోజుల్లో పిల్లలతో బాలసదనంలో కొన్ని గంటలు కాలక్షేపం చేసి వారితో కలివిడిగా ఉండి ధైర్యాన్ని నింపుతారు. చదువుకు అవసరమైన సాయం, బట్టలు, స్వీట్స్, ఇతరత్రా వస్తువులు అందిస్తారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు దేవుడిచ్చిన అమ్మల తరహాలో ప్రేమను పంచుతున్నారు.

ఇక్కడ చదివి ఉన్నత స్థానంలో..

అభాగ్యులకు విద్య, జీవనోపాధి అందించే లక్ష్యంగా ఏర్పాటు చేసిన బాల సదనం నిర్వహణలో మహిళా సంక్షేమ శాఖ తల్లి పాత్ర పోషిస్తుంది. ఇప్పటి వరకు సుమారు 900 మందికి బాల సదనంలో వసతి కల్పించారు. ఇక్కడ ఉండి చదివి ఉద్యోగం సాధించిన వారు కూడా ఉన్నారు. మాజీ కలెక్టర్ దత్తపుత్రిక రాధ ఎంబీఏ పూర్తి చేసి ప్రస్తుతం రాజ్‌పుష్పలో మంచి ఉద్యోగం సాధించింది. అదే విధంగా పలువురు అమ్మాయిలు పాలిటెక్నిక్ పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం చేస్తున్నారు.

● కలెక్టర్‌లు, డాక్టర్ల వంటి ప్రముఖుల తాకిడి..

సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా పని చేసిన వెంకట్రామిరెడ్డి ఇద్దరు పిల్లలను దత్తత తీసుకొని వారి పూర్తి బాధ్యతలు స్వీకరించారు. వారిలో పెద్ద అమ్మాయి ఎంబీఏ వరకు చదివేలా సాయం అందించారు. అదేవిధంగా ఎమ్మెల్యే హరీశ్ రావు సతీమణి శ్రీనిత గంటల కొద్ది బాలసదనంలో ఉండి వారితో కలిసి భోజనం చేశారు. అదే విధంగా జిల్లా పోలీసు కమిషనర్‌గా పనిచేసిన జోయల్ డేవిస్ సతీమణి డాక్టర్ ప్రతిప పలుమార్లు సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా పోలీసు కమిషనర్‌గా పని చేసిన శ్వేత, గతంలో కలెక్టర్‌గా పనిచేసిన ప్రశాంత్ జీవన్ పాటిల్, ప్రస్తుత కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్‌లుగా పని చేస్తున్న చంద్రశేఖర్, ముజమ్మిల్ ఖాన్, గరిమా అగ్రవాల్‌లు పలుమార్లు బాలసదనం సందర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రస్తుత పోలీసు కమిషనర్ అనురాధ సైతం పిల్లల బాగోగులు చూస్తూ వారికి అవసరమైన బుక్స్, బట్టలు అందిస్తున్నారు. వీరితో పాటు పట్టణానికి చెందిన ప్రముఖ మహిళా వైద్యులు, మహిళా ప్రజాప్రతినిధులు ఎందరో బాలసదనం సందర్శించి పిల్లలతో పండుగలు జరుపుకున్నారు.



దత్తత పిల్లలతో మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి



బాలసదనం యువతికి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివాహం

● సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివాహాలు

మరో వైపు బాలసదనంలో ఉండి పెరిగిన అనాథ అమ్మాయిలకు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సొంత ఖర్చుతో వివాహాలు జరిపించారు. జిల్లా కేంద్రంలో జరిగిన భాగ్య అనే అమ్మాయి వివాహం అధికారికంగా అప్పటి మంత్రి హరీశ్ రావు, అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డి సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా నాచారం దేవస్థానంలో మౌనిక అనే అమ్మాయి వివాహం కూడా బాలసదనం నిర్వాహకులు జరిపించారు.

ధైర్యంగా ఉంది



మా చిన్నతనంలోనే అమ్మానాన్న దూరమయ్యారు. ఎవరూ లేని మాకు బాలసదనం అండగా నిలిచింది. జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామిరెడ్డి మమ్మల్ని దత్తత తీసుకున్నారు. అక్క ఉన్నత చదువు పూర్తయ్యింది. నేను డిగ్రీ చదువుతున్న. ఇప్పుడు మాకు చాలా ధైర్యంగా ఉంది. జీవితం మీద ఆశ వచ్చింది.

-రాధ, రాధిక (అక్కాచెల్లెళ్లు)

పుట్టినిల్లు మాదిరిగా..



బాలసదనంలో ఉండే పిల్లలందరూ మా పిల్లలే. వారికి ఇది పుట్టినిల్లు. చదువు, ఆరోగ్యం తదితర చూసే బాధ్యత మాదే. ఇక్కడి పిల్లలకు ధైర్యం ఇచ్చేందుకు చాలా మంది ప్రముఖులు, అధికారులు రావడం జరుగుతుంది. అది పిల్లల్లో ఆత్మ విశ్వాసం కలిగిస్తోంది.

-మమత, బాలసదనం ఇన్‌చార్జి

బావిలో యువకుడి మృతదేహం లభ్యం

న్యాల్‌కల్(జహీరాబాద్): బావిలో స్నానానికి వెళ్లి నీట మునిగి మృతి చెందిన యువకుడి మృతదేహం లభ్యమైనట్లు హద్నూర్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని వడ్డి గ్రామానికి చెందిన శివకుమార్ శుక్రవారం తోటి స్నేహితులతో కలిసి వ్యవసాయ బావి వద్దకు స్నానానికి వెళ్లి నీట మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే. బావిలో నీరు అధికంగా ఉండటంతో శుక్రవారం సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం ఉదయం గాలింపు చేపట్టగా మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి పంపించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బావిలోంచి శవాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



నర్సవ్వ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): అనారోగ్య సమస్యలు భరించలేక చెరువులో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, మిరుదొడ్డి పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మద్దెల నర్సవ్వ (80) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతూ ఒక్కగానొక్క కొడుకు వద్ద కాలం వెళ్లదీస్తోంది. అనారోగ్య సమస్యలు రోజురోజుకు ఎక్కువ అవడంతో తాళలేక పోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో నర్సవ్వ కుటుంబ సభ్యులు బంధు మిత్రుల వద్ద, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం తెల్లవారు జామున మిరుదొడ్డిలోని పెద్ద చెరువులో నర్సవ్వ శవమై కనిపించింది. మృతురాలి కుమారుడు బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బోయిని పర్శరాములు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు..




అరవింద్(ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ: అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ పట్టణంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... పట్టణంలోని బారాహీమాం వీధిలో నివాసం ఉండే అమీన్‌పూర్(మోచి) యాదగిరి కుమారుడు అరవింద్(24) ఆర్టీసీ డిపోలో రెగ్జిన్ వర్క్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అరవింద్ తన తల్లి శాంతమ్మకు అనారోగ్యం కారణంగా రూ.3లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కోసం నిత్యం బాధపడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇప్పుడే వస్తానంటూ అరవింద్ ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. శనివారం ఉదయం వెతకగా ఇంటి పక్కన ఉన్న ఓ చెట్టుకు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. అప్పుల కారణంగానే తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి యాదగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్గీకరణ బిల్లుకు స్వాగతం

- ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్



మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్

మెదక్‌జోన్: అసెంబ్లీలో ప్రవేశపెట్టే ఎస్సీ వర్గీకరణ బిల్లును స్వాగతిస్తున్నామని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ మాదిగ అన్నారు. శనివారం పట్టణంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం దశాబ్దాల పాటు అనేక ఉద్యమాలు చేశామన్నారు. గతంలో నక్సలైట్లు ఎమ్మార్పీస్ నేతలను పోలీస్ ఇన్ఫార్మర్‌లు అనే నెపంతో కాల్చి చంపిన ఘటనలు సైతం ఉన్నాయని అలాంటి సమయంలో గుండె నిబ్బరంతో వర్గీకరణ పోరాటాన్ని సాగించామమని గుర్తు చేశారు. 2023లో హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో లక్షలాది మంది మాదిగలతో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరై వర్గీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో సైతం సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ కోసం కృషి చేసిన తీరు అభినందనీయమన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లారం రత్నయ్య మాట్లాడుతూ ఈనెల 17న అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెడుతున్న క్రమంలో గ్రామ గ్రామాన మాదిగలు డప్పు చప్పుళ్లతో దండోరా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రామచంద్రం, కృష్ణయ్య, స్వామీదాస్, సుమన్, ఏసు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి..



దుదేకుల అనిరోద్దీన్

మునిపల్లి(అందోల్): సింగూర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం అందోల్ మండల పరిధిలో చోటు చేసుకుంది. బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ కథనం ప్రకారం... మండల పరిధిలోని చిన్న చల్మెడ గ్రామానికి చెందిన దుదేకుల అనిరోద్దీన్, తక్కడపల్లి గ్రామానికి చెందిన సద్దాం అహ్మద్ కలిసి సింగూర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టడానికి విద్యుత్ యంత్రాలతో వెళ్లారు. చేపలు పడుతున్న సమయంలో దుదేకుల అనిరోద్దిన్(30) విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మద్యానికి బానిసై అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని సూరారం గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ కథనం పత్రకారం... మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన హకీమ్ పోశెట్టి(52) భిక్షాటన చేస్తూ మద్యానికి బానిసయ్యాడు. అనారోగ్యానికి గురి కావడంతో అతడి అన్న రాములు ఈనెల 8న ఆసుపత్రిలో వైద్యం చేయించి సదాశివపేట పట్టణంలోని దర్గా దగ్గర వదిలి వెళ్లాడు. సూరారం గ్రామ శివారులోని ఓ మామిడి తోట వద్ద వ్యక్తి చనిపోయి ఉన్నాడని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న మృతుడి అన్న రాములు ఘటనా స్థలానికి వెళ్లి చూశాడు. అనారోగ్యం కారణంగా, ఆహారం లేక, వడదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి అన్న రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కోనాయిపల్లిలో బంగారం, నగదు చోరీ

కొండపాక(గజ్వేల్): గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో నుంచి బంగారు నగలు, నగదును ఎత్తుకెళ్లిన ఘటన కుకునూరుపల్లి మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కోనాయిపల్లి గ్రామానికి చెందిన జహంగీర్ కుటుంబీకులతో కలిసి యాదగిరిగుట్ట సమీపంలో ఉన్న కొడువటూర్ గుట్ట దేవాలయానికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి తులంన్నర బంగారు నగలు, రూ. 20వేలను ఎత్తుకెళ్లారు. దర్శనం ముగించుకొని ఇంటికి వచ్చాక నగలు అపహరణకు గురైన విషయాన్ని గమనించి జహంగీర్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

నూతన పోస్టాఫీస్‌ను ప్రారంభించిన ఎంపీ ఎం.రఘునందన్ రావు



పోస్టాఫీస్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్ రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పోస్టాఫీస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశంలోని మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన పోస్టల్ సేవలను అందిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఐటీ ఉద్యోగులు ఈ ప్రాంతానికి పోస్టాఫీస్ కావాలని అడిగారని, తాను గెలిచిన వెంటనే అధికారులతో మాట్లాడి తెల్లాపూర్‌కు పోస్టాఫీస్ మంజూరు చేయించానని వివరించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు పోస్టాఫీస్‌కు భవనం కేటాయించారని చెప్పారు. రేడియల్ రోడ్డు నంబర్ 7నుంచి తెల్లాపూర్ రైల్వే స్టేషన్ పై నుంచి విద్యుత్‌నగర్ కాలనీ వరకు పెద్ద వంతెన నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సంబంధిత అధికారులతో చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజు, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, బీజేపీ తెల్లాపూర్ మున్సిపల్ అధ్యక్షుడు రాంబాబు గౌడ్, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ పాల్గొన్నారు.

మనస్తాపంతో ఉరేసుకొని..

సదాశివపేట(సంగారెడ్డి): మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలో నిజాంపురం సాగర్ అనే వ్యక్తి దగ్గర కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా తాలుకా దొంగర్గావ్ కమలాపూర్ గ్రామానికి చెందిన సంజుకుమార్(32) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. హోలీ సందర్భంగా తాగిన మైకంలో తోటి పనివారితో గొడవ పడుతూ రోడ్డుపై న్యూసెన్స్ చేశాడు. దీంతో పనిలో పెట్టించిన రమేశ్ సంజుకుమార్‌ను మందలించాడు. మనస్తాపానికి గురైన అతడు శుక్రవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయి శనివారం సిమెంట్ కడీల షెడ్డు వెనుకాల చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కట్టుకున్నోడే కడతేర్చాడు

- భార్య హత్య కేసులో భర్త అరెస్టు
- మృతురాలు బిహార్‌కు చెందిన మైనర్
- అనుమానాస్పద స్థితిలో మృతదేహం గుర్తింపు
- కేసును ఛేదించిన టూటౌన్ పోలీసులు



వివరాలు తెలుపుతున్న సిద్దిపేట ఏసీపీ మధు, పక్కన సీఐ ఉపేందర్

సిద్దిపేట కమాన్: అనుమానాస్పదంగా కుళ్లిన స్థితిలో మృతి చెందిన గుర్తు తెలియని మహిళ కేసును టెక్నాలజీ ఉపయోగించి సిద్దిపేట టూటౌన్ పోలీసులు ఛేదించారు. కట్టుకున్న భర్తే నిందితుడని పోలీసులు తేల్చారు. సిద్దిపేట ఏసీపీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రం, తల్వార్బంధ గ్రామానికి చెందిన బోలరాం హరిజన్ అలియాస్ సోను (20) అదే రాష్ట్రానికి చెందిన మైనర్ బాలిక(17)ను కొద్ది నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆమెకు మాయ మాటలు చెప్పి బాలిక తల్లిదండ్రులకు తెలియకుండా బిహార్ నుంచి సిద్దిపేటకు ఆరు నెలల క్రితం వచ్చి దక్కల కాలనీ మేర సంఘం భవనం సమీపంలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. బోలరాం హరిజన్ పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. హరిజన్ మద్యానికి బానిసై ప్రతిరోజు తాగి వచ్చి భార్యను కొట్టేవాడు. గత నెల 14న రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి తన భార్యతో గొడవపడ్డాడు. కోపంలో హరిజన్ తన భార్య తలను గోడకు బాది, గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం ఏమి చేయాలో తెలియక మృతదేహాన్ని పక్కనే ఉన్న మేర సంఘం భవనం నీటి సంపులో పడేసి నిందితుడు బిహార్‌కు పారిపోయాడు. సుమారు పదిహేను రోజుల తర్వాత ఈ నెల 1న మేర సంఘ భవనం సంపులో కుళ్లిపోయిన స్థితిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై సంఘం భవనం అధ్యక్షుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టెక్నాలజీ సాయంతో పోలీసులు నిందితుడిని గుర్తించి కేసును ఛేదించారు. నిందితుడు బలరాం హరిజన్ సిద్దిపేటలోని అద్దె గదిలో ఉన్న తన సామగ్రి తీసుకెళ్లడానికి బిహార్ నుంచి సిద్దిపేటకు శనివారం వచ్చాడు. విషయం తెలుసుకున్న సీఐ ఉపేందర్, ఏఎస్ఐ యాసిన్‌మియా, క్రైం కానిస్టేబుళ్లు కనకరాజు, సుధాకర్‌రెడ్డి, యాదగిరి, ప్రశాంత్‌లతో కలిసి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో తన భార్యను హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన క్రైం పార్టీ సిబ్బందిని ఏసీపీ అభినందించి, త్వరలో రివార్డు అందజేస్తామని తెలిపారు.